ఉపాధి కూలి.. అందదేమి?

- పూర్తిస్థాయి పనులు చేసినా దక్కని ఫలితం
- మే 15 వరకు మాత్రమే అందిన కూలి
- బకాయిలు రూ.2.68 కోట్లు

ఉపాధి హామీ పథకం కింద కూలీలకు సరిగా పనులు కల్పించకపోగా.. చేసిన పూర్తిస్థాయి పనులకు ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని వేతనదారులు వాపోతున్నారు. మే 15నుంచి ఇప్పటి వరకు గోస్పాడు మండలంలో మొత్తం రూ.2.68కోట్ల వేతన బకాయిలున్నట్లు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గోస్పాడు: జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. కూలీలకు సకాలంలో వేతనాలు అందకపోతుండటంతో పనులు చేసినా సంతృప్తి లభించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు వారీ మస్టర్లు వేస్తూ, బిల్లులు జనరేట్ చేస్తున్నా, కూలి మాత్రం అందడం లేదు. దీంతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందని వారు వాపోతున్నారు.

పనుల కల్పన అంతంత మాత్రమే..

రాజకీయాలకు అతీతంగా ఉపాధి పనులు కల్పించాల్సి ఉన్నా అధికారులు వాటిని పట్టించుకోకుండా తమకు అనుకూలమైన వారికే పనులు కల్పించారనే విమర్శలున్నాయి. కొన్నచోట్ల ఎక్కడ ఏం పనులు జరిగాయో సర్పంచ్ కానీ, ఎంపీటీసీ సభ్యుడికి కూడా తెలియని పరిస్థితి.

పొంతన లేని సమాధానాలు...

మండలంలో 9,332 వేల జాబ్‌కార్డులు ఉండగా వీరిలో 8,322 కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉంటున్నా.. కూలీలందరికీ పనులు కల్పించటం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. మే 15 వరకు జరిగిన పనులకు మాత్రమే కూలీలకు వేతనాలు అందగా, అప్పటి నుంచి దాదాపుగా లక్ష మందికి పైగా కూలీలకు రూ.2.68 కోట్లు వేతన బకాయిలు ఉన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు అందించాల్సి ఉంది. దీంతో కూలి సొమ్ము ఎప్పుడొస్తుందా అని వేతనదారులు ఎదురుచూస్తున్నారు. ఇక వేతనాలపై సంబంధిత అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వారు వాపోతున్నారు. రేపు, మాపు అంటూ తమను తిప్పుకుంటున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు వచ్చాక ఇస్తామని వ్యాపారుల వద్ద కొందరు అప్పు చేస్తుండగా, మరికొందరు వడ్డీకి రుణాలు తీసుకువచ్చి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది

ఉపాధి పథకంలో చేసిన పనులకు కూలీల మస్టర్లను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది. వేతనాల సొమ్ముపై కూలీలు ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో వేతనాలు చెలిస్తుంది. కూలి మొత్తం వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– అమానుల్లా, ఎంపీడీఓ, గోస్పాడు

ఎప్పుడు చెల్లిస్తారో?



ఈ ఏడాది ఉపాధి పనులు చేసినా పూర్తి స్థాయిలో కూలి అందలేదు. పని చేసినందుకుఇచ్చే సొమ్ము ఎప్పుడొస్తుందో తెలియటంలేదు. ఇప్పటికీ మూడు నెలలు దాటినా చెల్లించలేదు. అధికారులను అడిగితే ఇంకా డబ్బు జమ కాలేదని చెబుతున్నారు. రోజురోజుకూ బకాయిలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.

– హయగ్రీవాచారి, రాయపాడు

పూర్తి స్థాయిలో పనులు కల్పించలేదు



మండలంలోని గ్రామాల్లో పూర్తి స్థాయిలో పనులు కల్పించలేదు. అధికారులు గ్రామాల్లో ప్రజలందరికీ సమన్యాయం పాటించాల్సింది పోయి రాజకీయ కోణంలో అధికార పక్షానికి తలొగ్గి కూలీలకు అన్యాయం చేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు కల్పించకపోగా చేసిన పనులకు సకాలంలో కూలి అందించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

– ఆర్థర్‌సైమాన్, ఎంపీపీ, గోస్పాడు

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


సామూహిక కుంకుమార్చనలో భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు గావించి అనంతరం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాయ, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

నంద్యాల(అర్బన్): జిల్లా రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించాలని కిసాన్ మోర్చ జిల్లా గౌరవాధ్యక్షుడు తూము శివారెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారన్నారు. అరకొరగా వస్తున్న ఎరువులు పంట దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ మోర్చ రథసారథిగా ఎన్నికైన కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలుగజేసుకొని యూరియా కొరత నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గురుమూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


డబ్ల్యూ కొత్తపల్లె పీహెచ్‌సీలో మొక్క నాటుతున్న సిబ్బంది

దొర్నిపాడు: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి(జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి) గోవిందనాయక్ సూచించారు. శనివారం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డబ్ల్యూ కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ సావిత్రి, వైద్యాధికారి ఉసేని తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నంద్యాల(అర్బన్): పత్తిలో యాజమాన్య పద్ధతులు చేపడితేనే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తెలిపారు. పిందె, పూత రాలిపోతే వాటి నివారణకు నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్ 1మి.లీ 4.5 లీటర్ల నీటిని కలిపి ఒకటి లేదా రెండు సార్లు 15రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం ఏడీఆర్ జాన్సన్ అధ్యక్షతన నిర్వహించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ కాయకుళ్లు, ఆకుమచ్చ తెగుల నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. మొక్కజొన్న పంటలో అధిక దిగుబడికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై డాక్టర్ వెంకటరమణ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, ఇషాప ర్వీన్, మద్దిలేటి, అరుణకుమారి పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు

చాగలమర్రి: మండలంలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగాలతో మంచానికే పరిమితమైన కార్డు దారులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే అందజేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 39 షాపుల ద్వారా సుమారు 1700 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వారందరికీ ప్రతి నెలా 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సరుకులు ఇంటి వద్దకే పంపిణీ చేయాలని సూచించారు. అలా చేయకపోతే ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ సత్తార్, మండల డీలర్లు పాల్గొన్నారు.

ఆదర్శం ఆంధ్రకేసరి జీవితం


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జీవితం ఆదర్శనీయమని నంది సమాఖ్య గౌరవ సలహాదారు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకొని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, ముఖ్యమంత్రిగా ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. పట్టణంలోని గాంధీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌కు ప్రకాశం పంతులు పేరును పెట్టాలని కోరారు. గతంలో ఆయన పేరు మీదనే కూరగాయల మార్కెట్ ఉండేదన్నారు. అలాగే ప్రకాశం పంతులు విగ్రహం కూడా ఉండేదని, పునః ప్రతిష్ఠించాలన్నారు. డాక్టర్ హయగ్రీవాచారి, గెలివి సహదేవుడు, కిశోర్‌కుమార్, రైతు నాయకులు కృష్ణారెడ్డి, ఓబులపతి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సాయిబాబానగర్‌లో ఉన్న శ్రీశైలం పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రత్యేక అధికారి మురళీకృష్ణారావు ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నబిసాహెబ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ అమావాస్య పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల ఆలయాల్లో శ్రావణమాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున భక్తులు లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకం, ఆకుపూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలోని ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు పలు విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన సందర్భంగా వారికి శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని చెప్పారు. విద్యార్థులు సృజన్ ఐఐటీ సీఎస్ఈ (డేటా సైన్స్), సుస్మిత ఎన్ఐటీ వరంగల్ సివిల్ ఇంజినీరింగ్, కాశీ విశ్వనాథరెడ్డి ఎన్ఐటీ సిల్చర్ అస్సాం మెకానికల్ ఇంజినీరింగ్, బాలాజీ ట్రిపుల్ ఐటీ, గోపాల్ సీఎస్ఈ (సైబర్ ఫిజికల్ సిస్టమ్), శరత్ ట్రిపుల్ ఐటీ కాంచీపురం మెకానికల్ ఇంజినీరింగ్, చరణ్‌నాయక్ ట్రిపుల్ ఐటీ కొట్టాయం కేరళ సీఎస్ఈ, యశ్వంత్‌రెడ్డి జీఎఫ్‌టీఐ గతిశక్తి విద్యాలయం వడదోర మెకానికల్ ఇంజినీరింగ్(రైల్ ఇంజనీరింగ్), చంద్రహాసినిరెడ్డి మణిపాల్ యూనివర్సిటీల్లో సీట్లు సాధించారని వివరించారు. అనంతరం వారిని సన్మానించి అభినందించారు.

బదిలీల ఉత్తర్వులు సవరించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పురపాలక ఉపాధ్యాయులకు ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీల ఉత్తర్వులు సవరించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నంద్యాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవేంద్రుడు, మహేంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలను ఆపాలని కోరుతూ పాఠశాల భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు 506, 507 ద్వారా బదిలీలు జరిపినప్పుడు స్పెషల్ కేటగిరీలో మున్సిపల్ ఉపాధ్యాయులకు లాభం చేకూరుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలోని ఉపాధ్యాయులకు మున్సిపల్ వ్యవస్థలోని మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీల విషయంలో సంక్లిష్టతలను దృష్టిలో పెట్టుకొని జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. నాయకులు వరప్రసాదరెడ్డి, జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, కార్యవర్గ సభ్యులు నాగశేషులు, ఆనంద్, ఈశ్వరరెడ్డి, సురేష్,ప్రసాదరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్ఓ రాము నాయక్

నంద్యాల: స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ కోరారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ తప్పులు లేని, ఓటర్ల మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గం పాండురంగాపురం గ్రామానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, శివరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, సీపీఐ పార్టీ ప్రతినిధి పి.నరసింహులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ పరిధిలోకి కల్యాణ మండపం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది ఆలయంలోని కల్యాణ మండపం దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చిందని నంద్యాల జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ మోహన్, ఆలయ ఈఓ రామానుజచార్యులు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కొద్ది రోజుల్లో వేలం ద్వారా గుత్తేదారులకు అప్పగిస్తామన్నారు. ఆ శాఖ అధికారులు హరిశ్చంద్రారెడ్డి, వేణునాథరెడ్డి, స్వర్ణముఖి, సువర్ణ, చంద్రుడు, రామాంజనేయశర్మ, కార్తీక్, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కలుగుతుందన్నారు. రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలని చెప్పారు. స్వచ్ఛ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా జిల్లా శుభ్రంగా ఉంటుందన్నారు. అధిక వర్షాల కారణంగా నీటి నిల్వలతో డయేరియా ప్రబలకుండా విస్తృత చర్యలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో పిచ్చిమొక్కలు, చెత్త వ్యర్థాలను సిబ్బందితో కలిసి తొలగించి ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్ఓ రాము నాయక్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను నమోదు చేయాలి

వివిధ శాఖలకు పురోగతికి సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను త్వరగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండికేటర్స్ ఆధారంగా శాఖల పురోగతిపై ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లా అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సరైన వివరాలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సీపీఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సురవరం మృతి తీరని లోటు

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఉమ్మడి జిల్లాల ఉద్యమాల మార్గదర్శి సుధాకర్‌రెడ్డి తమకు స్ఫూర్తి అన్నారు. బడుగు బలహీన వర్గాలు, కార్మిక కర్షకులు, రైతాంగ హక్కుల కోసం ఎర్రజెండా అజెండాగా సాగారన్నారు. విద్యార్థిదశ నుంచి ఉద్యమాలను బలోపేతం చేస్తూ ప్రజా సంఘాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు

రుద్రవరం: మండలంలో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బాలస్వామి ఆధ్వర్యంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు కాలనీల్లో మురుగును తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఆలమూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బురద కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గ్రామ కార్యదర్శి పాములేటి బురద తొలగించి సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ముత్తలూరు, ఎల్లావత్తుల, శ్రీరంగాపురం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మురుగు తొలగించి, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

గ్రామాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర

నంద్యాల(అర్బన్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, హెల్త్, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ జ్యోతి పుసులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. అలాగే పట్టణంలోని ఎస్సార్బీసీ కాలనీలోని సర్కిల్–2 కార్యాలయ ఆవరణలో కార్యాలయ ఏఈ మోహన్‌తో పాటు డిప్యూటీ ఇంజనీర్ శ్రీదేవి పరిశుభ్రత పనుల్లో పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్


నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ: పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి శనివారం డీఎస్పీ ప్రమోద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లోని పోక్సో కేసు నిందితులతో స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.బాధ్యతయుత ప్రవర్తనతో మంచి పౌరులుగా మారాలని సూచించారు. నిరంతరం నిఘా ఉంటుందని ఏమాత్రం అనుమానం వచ్చినాపరిస్థితులు తీవ్రంగాఉంటయనిస్పష్టం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్


గోస్పాడులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జేసీ విష్ణుచరణ్ అన్నారు. శనివారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రతి మూడో నెల శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వర్షాకాలం దృష్ట్యా ఈసారి పరిశుభ్రతపై దృష్టి సారించామన్నారు. అంటువ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మురుగు కాల్వలను శుభ్రం చేస్తూ తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసశర్మ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోస్పాడు: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్డీ నాగ అనసూయ అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ఆయా శాఖల సిబ్బంది స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం నిర్వహించాల్సిన కార్యక్రమం రాఖీ పౌర్ణమి సందర్భంగా నాల్గో వారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ అబ్దుల్‌కరీం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఈలు సుబ్రహ్మణ్యం, జ్ఞానసూర్యుడు, పుల్లయ్య పాల్గొన్నారు. అలాగే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుపేర్కొన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో వీధులను శుభ్రం చేసి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈఓపీఆర్డీ నాగలక్ష్మమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ చేతికొచ్చింది

- 53 మంది బాధితులకు ఫోన్లు అప్పగింత


బాధితురాలికి సెల్ ఫోన్ అందజేస్తున్న డీఎస్పీ ప్రమోద్


పొందిన ఫోన్‌లతో బాధితులు

ఆళ్లగడ్డ: ఎంతో ఇష్టపడి కొన్న ఫోను పోతే అయోమయంలో పడతారు. ఆన్‌లైన్ బ్యాంక్ లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం అపరచితుల చేతికి చేరుతుందనే ఆందోళనకు గురవుతుంటారు. కొంత మంది పాత ఫోనే కదా అని తేలికగా తీసుకుంటున్నారు. స్టేషన్‌కెళ్లినా ఫిర్యాదు తీసుకోవట్లేదనే అభిప్రాయంతో మరికొందరు మౌనం వహిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఫోన్లు పోతున్నాయి. బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడంతో కొన్నింటిని పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు అండగా నిలిచి వాటిని తిరిగి బాధితులకు అందించేలా ప్రత్యేక చొరవ చూపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం డీఎస్పీ ప్రమోద్ ఫోన్ పోగొట్టుకున్న 52 మంది యజమానులకు రికవరీ చేసిన మొబైళ్లను అందజేశారు. వీటి రికవరీలో ప్రతిభ చూపిన ఐటీ కోర్, సీసీఎస్ సిబ్బందిని అభినందించారు. కాగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలని డీఎస్పీ సూచించారు. వాట్సాప్ నంబర్ 91211 01107 హాయ్ అని టైప్ చేసి ఏకేపీ మొబైల్ ట్రాకర్.ఇన్ లింక్ నొక్కడం ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఎఫ్ఐఆర్ కట్టకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభంగా పోగొట్టుకున్న మొబైల్ కనుగొని బాధితులకు త్వరగా అందజేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ తెలిపారు.

యూరియా పంపిణీ


కోటపాడుకు వచ్చిన యూరియా లారీ

శిరివెళ్ల:మండలంలోని కోటపాడు రైతు సేవా కేంద్రం వద్ద శనివారం యూరియా పంపిణీ జరిగింది. యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. ముందుగా సిబ్బంది రైతుల జాబితా తయారు చేశారు. లారీ రాగానే పంపిణీ మొదలు పెట్టారు. ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున తీర్మానం చేశారు. 544 బస్తాల యూరియాను 272 మంది రైతులకు పంపిణీ చేశారు.

సరిపడ యూరియా తెప్పించండి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేకుండా అవసరమయ్యే యూరియాను తెప్పించాలని మార్క్‌ఫెడ్ అధికారులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కోరారు. శనివారం మార్క్‌ఫెడ్ కార్యాలయంలో మేనేజర్ హరినాథరెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు.